సాక్షి జగిత్యాల

సోమవారం। 23। సెప్టెంబర్। 2024



గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం సెలవు దినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



కొండగట్టులో భక్తుల రద్దీ

కరీంనగర్: కొండగట్టు అంజన్న ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన 150 మంది హనుమాన్ దీక్ష స్వాములు ఆలయంలో విరమణ చేశారు.

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆహ్లాదం.. బహుదూరం

- కోరుట్లలో మినీ ట్యాంక్‌బండ్ పనులు మూలకు..
- రూ.9 కోట్లతో చేపట్టిన పనులు నిరుపయోగం
- పట్టింపు చూపని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు
- చెరువును ఆక్రమించిన గుర్రెపుడెక్క
- పట్టణ ప్రజలకు కరువైన ఆహ్లాదం



అర్ధంతరంగా నిలిచిన కోరుట్లలోని మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు

కోరుట్ల: ఒకటి రెండు కాదు.. ఏకంగా రూ.తొమ్మిది కోట్లు వ్యయం చేసి ఏర్పాటుచేసిన మినీ ట్యాంక్‌బండ్ నిరుపయోగంగా మిగిలిపోయింది. మినీ ట్యాంక్‌బండ్ కోరుట్ల పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనుకున్న ఆశలు ఉత్తవే అయ్యాయి. చివరి దశలో సుందరీకరణ పనులు నిధుల లేమిలో నిలిచిపోవడం సమస్యగా మారింది. ప్రస్తుతం మినీట్యాంక్ బండ్ మళ్లీ అస్తవ్యస్తంగా మారి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

రూ.9 కోట్ల వ్యయం

పదేళ్ల క్రితం కోరుట్లలోని మద్దుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. అంతకుముందు మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ఈ పనులకు శ్రీకారం చుట్టినా.. పెద్దగా ఫలితం దక్కలేదు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మద్దుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు మొదట రూ.3 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో చెరువులో పూడిక తీయడంతోపాటు కట్టను బలపరిచారు. అనంతరం చెరువు కట్టపై ఫుట్‌పాత్ నిర్మించారు. రెండో దఫాలో మరో రూ.3 కోట్లు కేటాయించి చెరువులో మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు. చెరువు కట్టపై మినీ ట్యాంక్‌బండ్‌కు అవసరమైన నిర్మాణాలు చేపట్టారు. రెండేళ్ల క్రితం సుందరీకరణ పనుల కోసమని మరో రూ.3 కోట్లు కేటాయించారు. ఈ పనులు పూర్తి స్థాయిలో కాలేదు. అయినప్పటికీ రెండు సాధారణ బోట్లు, మరో రెండు స్పీడ్ బోట్లను ప్రారంభించారు. రెండు మూడు నెలల తరువాత ఆ బోటింగ్ ఆగిపోయింది. చివరికి మినీ ట్యాంక్‌బండ్ గుర్రపు డెక్కతో నిండిపోయి చెరువులోని నీరు దుర్వాసన వస్తోంది.

పట్టించుకునేవారేరీ..

మినీ ట్యాంక్‌బండ్ బాగు చేయడంపై ఇటు ఇరిగేషన్ అధికారులు, అటు మున్సిపల్ అధికారులు ఎలాంటి శ్రద్ధ కూడా చూపడం లేదు. ఫలితంగా కొన్ని నెలలుగా మినీ ట్యాంక్‌బండ్ మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు మంచి అడ్డాగా మారింది. ఫుట్‌పాత్‌పై బీరు సీసాలు, సుందరీకరణ కోసం అక్కడ ఉన్న నిర్మాణాలపై తప్పుడు రాతలతో అసహ్యకరమైన వాతావరణం నెలకొంది. దీనికి తోడు మినీ ట్యాంక్‌బండ్ నీరు తొలగించి శుభ్రపరచడంపైనా ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. రాత్రి వేళల్లో ఆ పరిసరాల్లో యువకులు గొడవలకు దిగుతున్నారని చుట్టుపక్కల ఇళ్లవారు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా మినీ ట్యాంక్‌బండ్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసి నిర్మాణాలు దెబ్బతినకుండా.. మందుబాబులు చేరకుండా చర్యలు తీసుకోవాలన్న యోచన ఎవరికీ రాకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మినీ ట్యాంక్‌బండ్ చివరి దశలో నిధుల లేమితో పనులు పూర్తికాక పనికి రాకుండా పోయే దుస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



వృథాగా ఉన్న బోటు



గుర్రపు డెక్కతో నిండిని మినీ ట్యాంక్‌బండ్

చర్యలు తీసుకుంటాం

మినీ ట్యాంక్‌బండ్‌ను బాగు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ట్యాంక్ బండ్‌పై రాత్రి వేళ కొంతమంది యువకులు అడ్డాలు వేయడం అసహ్యకరమైన పరిస్థితులకు దారితీస్తోందన్న ఫిర్యాదులు ఉన్నాయి. నిధుల కొరతతో కొంత సమస్య ఉంది.

– తిరుపతి, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

చేయిచేయి కలిపారు.. రోడ్డును బాగుచేశారు



ఒబులాపూర్ శివారులోని హైలెవల్ వంతెనకు మరమ్మతు చేస్తున్న యువకులు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం మెట్‌పల్లి–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఒబులాపూర్ శివారులో నిర్మించిన హైలెవల్ వంతెనపై ఇనుపరాడ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ దారిమీదుగా వెళ్లే వాహనాలు దెబ్బతింటున్నాయి. రోడ్డుకు మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఒబులాపూర్‌కు చెందిన పల్లి శేఖర్, అర్జున్, కాశిరాం, రాజు, భాను ముందుకొచ్చి దెబ్బతిన్న బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతు చేసేందుకు నడుంబిగించారు. ట్రాక్టర్‌లో సిమెంట్ బ్యాగులు, ఇసుకు, కంకరను తీసుకెళ్లి సుమారు రెండు గంటలపాటు శ్రమించి మరమ్మతు చేశారు. యువకులను పలువురు అభినందించారు.



రోడ్డుకు మరమ్మతు చేస్తున్న యువకులు

న్యూస్‌రీల్

రెడ్డి సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం



కార్యవర్గంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలజోన్: సేవాభావంతోనే రెడ్డిలు ప్రతి రంగంలో ముందు వరుసలో ఉంటున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా రెడ్డి సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంఘాలు సమాజసేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యమన్నారు. కరీంనగర్ నగరపాలక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డిలు సేవ చేసేవారేగాని పొట్టకొట్టేవారు కాదన్నారు. రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొప్పెర వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిష్టంపేట రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి రజిత, సంయుక్త కార్యదర్శులుగా వెల్మ నవీన్‌కుమార్ రెడ్డి, అయిల్నేని ప్రియాంక రెడ్డి, కోశాధికారిగా నేరేళ్ల భూమరెడ్డితో ప్రమాణం చేయించారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, సంది తిరుపతి రెడ్డి, శైలేందర్ రెడ్డి, రాంగోపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ‘పొలం బాట’



పొలంబాటలో అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం జగిత్యాల సర్కిల్ పరిధిలోని ఒడ్డెలింగాపూర్ సెక్షన్, కోరుట్ల రూరల్ సెక్షన్, చల్‌గల్ సెక్షన్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి డీఈలు రాజిరెడ్డి, తిరుపతి, సెక్షన్ పరిధిలోని ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా లక్ష్మీపతి



తొగరి లక్ష్మీపతి

మేడిపల్లి: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన సామాజిక సేవకులు తొగరి లక్ష్మీపతిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ బద్దిపడిగ శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

గిజిగాడిగూళ్లు.. కనుల విందు



ఆకట్టుకుంటున్న కొబ్బరి చెట్టు ఆకులకు పక్షుల గూళ్లు

మల్యాల: గిజిగాడి గూళ్లే ప్రత్యేకంగా ఉంటాయి. చెట్ల కొమ్మల అంచులకు గూళ్లను నిర్మించుకుంటాయి. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్‌కుమార్ ఇంట్లోని కొబ్బరి చెట్టుకు ఇలా గూళ్లను నిర్మించుకున్నాయి.

సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఆహ్వానం

జగిత్యాల: బెంగళూరులోని విశ్వేరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియంలో నిర్వహించే దక్షిణ భారత్ సైన్స్ డ్రామా ఫెస్టివల్ (ఎస్ఐఎస్‌డీఎఫ్)లో పాల్గొనడానికి జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 28న జిల్లాకేంద్రంలోని టీచర్స్ భవన్‌లో జరిగే ఎంపికలో పాల్గొనాలని జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ పేర్కొన్నారు. పాల్గొనే పాఠశాలల విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలలు విద్యాశాఖ జారీ చేసిన గూగుల్ ఫారంను ఈనెల 26లోపు నింపి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అపూర్వ సమ్మేళనం



45 ఏళ్లకు ఒకేచోట..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల 1978–79లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వెల్లుల శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. గంగాధర్, వెంకటనర్సయ్య, హేమచందర్, మనోహర్, రజియోద్దీన్, వెంకటరమణ, మనోహర్, భూపాల్, మధుసూదన్, గోపి, ఉమామహేశ్వర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.



రాయికల్‌లో 30 ఏళ్లకు..

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలో ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. దుబాయ్ నుంచి బూర్ల సంతోష్, ముంబయి నుంచి బోగ రవీందర్ హాజరు కావడం విశేషం.



మెట్‌పల్లిలో పాతికేళ్ల తర్వాత..

మెట్‌పల్లి: పట్టణంలోని శ్రీశ్రీనివాస గురుకులం పాఠశాలలో 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు స్థానిక నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. బాస శ్రీవర్ధన్ మస్కట్ నుంచి రావడంతో తోటి స్నేహితులు ప్రత్యేకంగా అభినందించారు.



పొరండ్లలో ఘనంగా..

జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–2004 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు హన్మాజీపేట లక్ష్మీ గార్డెన్‌లో సమ్మేళనం నిర్వహించారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.



సాయి మందిరంలో దేవీవైభవ ప్రవచనాలు

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో దేవీ వైభవ ప్రవచనాలు ఆదివారం మూడోరోజుకు చేరాయి. వేదపండితులు తిగుళ్ల విషశర్మ ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవీదర్శనం, త్రిమూర్తులస్తుతి, దేవి తత్వోప దేశం, ధృవసంధి చరిత్ర ఘట్టాలను వివరించారు. ఆలయ అధ్యక్షుడు సతీశ్ కుమార్, మార లక్ష్మీనారాయణ, రాజేశం, కైలాసం, రాంచంద్రం పాల్గొన్నారు.



సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలి

- సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్



మాట్లాడుతున్న పుప్పాల శ్రీకాంత్

జగిత్యాలటౌన్: సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటం సాగించాలని, కార్పొరేట్, మతోన్మాద శక్తుల దాడులను ఎదుర్కోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాట వక్షోత్సవాల సమావేశాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ అధ్యక్షతన ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ.. అణిచివేత, దోపిడీ, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కుల మతాలకు అతీతంగా జరిగిన సాయుధ పోరాటాన్ని హిందు, ముస్లిం ఘర్షణగా చిత్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ఆ ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. సాయుధ పోరాట యోధుల త్యాగాలను తక్కువ చేసేలా సాగుతున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, నాయకులు కోమటి చంద్రశేఖర్, వి.వెంకటాచారి, జి.రమేశ్, సిరికొండ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు బంద్ చేయాలి

- జగ్గాసాగర్‌లో పోస్టర్ల కలకలం
- యువత పేరిట వెలసిన వైనం



బెల్ట్‌షాపులు బంద్ చేయాలని వెలసిన పోస్టర్లు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో వెలసిన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బెల్ట్‌షాపులను బంద్ చేయాలంటూ జగ్గాసాగర్ యువత పేరిట వెలసిన పోస్టర్ల వ్యవహారం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)కి.. వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ మధ్య కొద్దిరోజులుగా వివాదం జరుగుతోంది. వినాయకుని శోభాయాత్రలో డీజేలు పెట్టడంపై తమ మాట ధిక్కరించారని వీడీసీ ఇటీవల ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించింది. డీజేలు పెట్టిన వారంతా రూ.15 వేలు చెల్లించాలని ఆదేశించింది. దీనిని వ్యతిరేకించిన ఉత్సవ కమిటీల సభ్యులు వీడీసీ తీరును నిరసిస్తూ మూడురోజుల క్రితం గ్రామంలో డీజే పెట్టి ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఆ సమయంలో ర్యాలీ చేస్తూ బెల్ట్‌షాపులు ఎత్తివేయాలని యువకులు నినాదాలు కూడా చేశారు. దీంతో మరింత ఆగ్రహించిన వీడీసీ ఆ మరుసటి రోజు ఓ వ్యక్తిని బాధ్యుడిని చేస్తూ రూ.50 వేలు జరిమానా విధిస్తున్నామని, నిర్ణీత తేదీ వరకు జరిమానా కట్టాలని హెచ్చరికలు జారీ చేసింది. ఈ విషయంపై గ్రామంలోని యువత జీర్ణించుకోలేకపోతోంది. ఈ పరిణామాల మధ్య ఒక్కసారిగా గ్రామంలో బెల్ట్‌షాపులు బంద్ చేయాలనే పోస్టర్లు వెలవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని యువకుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

పోషకాహారలోపం అధిగమించేనా..?

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసం
- ఈనెల 30వరకు కార్యక్రమాలు
- బీఎల్వో విధుల్లో అంగన్‌వాడీలు
- జిల్లాలో 1,065 సెంటర్లు



ముత్యంపేటలో పోషక మాసోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

మల్లాపూర్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు సెప్టెంబర్ నెలను జాతీయ పోషకాహార మాసంగా ప్రకటించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల ఒకటి నుంచి పోషకాహార కార్యక్రమాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)గా సేవలు అందిస్తుండడంతో పోషకాహార మాసం కార్యక్రమాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ఇంటింటి ఓటరు జాబితా సమగ్ర సర్వేను బీఎల్వోలుగా అంగన్‌వాడీ టీచర్లు చేపడుతున్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, ఆరేళ్లలోపు పిల్లల్లో ఎత్తు, బరువు కొలతలు చేపట్టి పెరుగదల పర్యవేక్షించాల్సి ఉంటుంది. కిశోర బాలికల ఆరోగ్యం ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. వారికి అవసరమైన పోషకాహారం అందిస్తేనే శారీరక వికాసం సాధ్యం. లేకుంటే అనేక రుగ్మతల బారిన పడాల్సి వస్తుంది. అయితే పోషకాహారంపై సరైన అవగాహన లేకపోవడం.. పేదరికం కారణంగా చాల మంది వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోషకాహారం ఆహారం ఆవశ్యకతను వివరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సెప్టెంబర్ నెలను జాతీయ పోషకాహార మాసంగా గుర్తించి పోషణ అభియాన్ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల్లో ఉన్న 1065 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పోషకాహార మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. అయితే అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్వోల విధులతో అదనపు బాధ్యతల కారణంగా కార్యక్రమాల అమలుపై ప్రభావం పడుతోంది.

1065 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిల్లో 1037 ప్రధాన, 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆరేళ్లలోపు చిన్నారులు 70,444 మంది, గర్భిణులు 7,702, బాలింతలు 7,038 మంది ఉన్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా ఈనెల 30 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. పిల్లల ఎత్తు, బరువు కొలతలు సేకరించడం, గర్భిణుల బరువు, భుజం కొలతలు తీసుకోవడం, పోషకాహారంపై అవగాహన కల్పించడం వంటివి చేయనున్నారు. చిన్నారులకు రోజువారీ సందేశాలు ఇస్తూ వ్యాసరచన, డ్రాయింగ్, పోస్టర్ల తయారీ, హ్యాండ్‌వాష్ ప్రదర్శనలు, తల్లిదండ్రులతో సమావేశాలు, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నారు.

జిల్లా ప్రొఫైల్

ప్రాజెక్టులు	04
అంగన్‌వాడీ కేంద్రాలు	1,065
ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు	1,037
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	28
ఆరేళ్ల లోపు చిన్నారులు	70,444
గర్భిణులు	7,702
బాలింతలు	7,038

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతీరోజు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చిన్నారులు, గర్భిణుల, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాలన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. అంగన్‌వాడీలు బీఎల్వోలుగా విధులు నిర్వర్తిస్తున్నందున మధ్యాహ్నం వరకు కేంద్రాల్లో.. తర్వాత బీఎల్వో విధులు నిర్వర్తించాలని సూచించాం.

– నరేశ్, జిల్లా సంక్షేమ అధికారి

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


ఆంజనేయులు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తనపై దాడి చేయడాన్ని అవమానంగా భావించి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నర్సింగపూర్‌లో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. నర్సింగపూర్‌కు చెందిన యువకుడు సూద్రం ఆంజనేయులు(22) అదే గ్రామానికి చెందిన వివాహితతో సన్నిహితంగా మెలుగుతున్నాడని ఆమె భర్త అనుమానించాడు. అంతేకాకుండా ఈనెల 15, 17 తేదీల్లో వివాహిత భర్తతోపాటు మరో ఐదుగురు ఆంజనేయులుపై దాడిచేశారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో ఆంజనేయులు ఉరివేసుకున్నాడు. తన కుమారుడి మృతికి ఆరుగురు కారణమంటూ మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఏఎస్సై బాపు తెలిపారు.

ఆర్వీఎంకు మణెమ్మ పార్థివదేహం


ఆవాల మణెమ్మ(ఫైల్)

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ మాజీ ఎంపీటీసీ ఆవాల మణెమ్మ(88) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె దేహాన్ని హైదరాబాద్‌లోని ఆర్వీఎం ఆసుపత్రికి అప్పగిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మణెమ్మ 2014 నుంచి 2018 వరకు కొండపాక- హిమ్మత్‌నగర్ గ్రామాలకు ఎంపీటీసీగా సేవలందించారు. మణెమ్మ మృతదేహాన్ని ఆసుపత్రులకు ప్రయోగాల కోసం ఇవ్వాలని తరచూ చెప్పేదని, అందుకే పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించినట్లు మణెమ్మ మనువడు హరిబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాల వైద్యులు కొండపాకకు చేరుకొని వివరాలు నమోదు చేసుకొని పార్థివ దేహాన్ని తీసుకెళ్లారు.

గోదావరినదిలో వ్యక్తి మృతదేహం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి బ్రిడ్జి సమీపంలో ఇటుకబట్టీల వద్ద ఆదివారం సాయంత్రం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాలు.. గోదా వరినదిలో మృతదేహం తేలినట్లు సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేశ్(32)గా గుర్తించారు. వెంకటేశ్ మంచిర్యాల టౌన్‌లో ఇంటర్నెట్ షాప్ నడుపుతాడు. ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండిషన్ బెయిల్‌పై వచ్చాడు. కాగా వెంకటేశ్ ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా.? అనేది తేలాల్సి ఉంది. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేశ్‌గా గుర్తించారని పోలీసులు పేర్కొన్నారు.

వి'పత్తి'.. విపణిపైనే ఆశ

- ఎడతెరిపి లేని వర్షాలతో ఎదుగుదల లేని పత్తి
- ముసురుకుంటున్న తెగుళ్లు
- తగ్గనున్న దిగుబడి.. మద్దతు ధరే దారి
- సీసీఐపైనే అన్నదాతల ఆశలు
- కొనుగోళ్ల ప్రక్రియ కోసం సన్నాహాలు


అమ్మకానికి వచ్చిన పత్తి

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం: 3,34,606ఎకరాలు
పత్తి సాగు విస్తీర్ణం: 43878ఎకరాలు
దిగుబడి అంచనా: 3.07లక్షల క్వింటాళ్లు
పత్తి మద్దతు ధర (క్వింటాలుకు): మధ్యరకం: రూ.7121
పొడవాటి రకం: రూ.7521

కరీంనగర్ అర్బన్: పత్తి ఈ సారి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఆరంభంలో ఊరించిన పంట అకాల వర్షాలు, ఎడతెరిపిలేని వర్షాలతో ఆందోళన నెలకొంది. ఆగస్టు మొదటివారం వరకు పత్తి పంట ఆశలు నింపింది. వరుసగా వర్షాలు కురియగా చేలలో 20రోజులకు పైగా అడుగు పెట్టలేని పరిస్థితి. దీనికితోడు పచ్చ పురుగు, తెల్లదోమ ముప్పిరిగొనగా నివారణకు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో పంట దిగుబడి గణనీయంగా తగ్గనుండగా గిట్టుబాటు ధర కల్పించడమే అధికారుల ముందున్న మార్గం. వచ్చే నెలలో పత్తి కొనుగోళ్లకు యంత్రాంగం సన్నాహాలు చేస్తుండగా కలెక్టర్ పటిష్టమైన చర్యలు చేపట్టడం అత్యవసరం.

తగ్గుతున్న విస్తీర్ణం

జిల్లాలో వరి, పత్తి ప్రధాన పంటలు కాగా పత్తి సాగు గణనీయంగా తగ్గుతోంది. వరి 2.70లక్షల ఎకరాల్లో సాగైతే పత్తి కేవలం 43వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. అయిదేళ్ల క్రితం 1.10లక్షల ఎకరాల్లో సాగవగా ఈ సారి సగానికి పైగా తగ్గింది. చొప్పదండి, రామడుగు, గంగాధర, గన్నేరువరం, ఇల్లందకుంట, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్ తదితర పత్తి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది. కానీ వర్షాలు సమృద్ధిగా కురియడంతో వరి సాగుకే మొగ్గు చూపారు.

జిన్నింగ్ మిల్లులేనా అడ్డాలు

వ్యవసాయ మార్కెట్లలో పంట ఉత్పత్తులను విక్రయించే రైతులకు గత మూడేళ్లుగా భిన్న పరిస్థితి నెలకొంది. పత్తి పంటను కేవలం జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఇదేంటంటే మార్కెట్ యార్డుకు రైతులు విడిపత్తి తేవడం లేదని, అటే తీసుకెళుతున్నారని మిల్లుల నిర్వాహకులకే వత్తాసు పలుకుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ మార్కెట్లలోనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు చేకూరనుండగా అధికారుల లోపాయికారి ఒప్పందంతో మిల్లులకే పంపించే ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తీరా మిల్లుకు వెళ్లాకా పత్తి నాణ్యతగా లేదని సీసీఐ నిరాకరించి వ్యాపారులే కొనుగోలు చేసేలా పరోక్షంగా సహకరిస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో కాకుండా మార్కెట్ యార్డుల్లోనే సీసీఐ కొనుగోలు చేసేలా చూడాలని వారు కోరుతున్నారు.

సన్నాహాలు మొదలు

పత్తి కొనుగోళ్లకు సీసీఐ యంత్రాంగం సన్నాహాలు మొదలెట్టింది. ఈ సారి సీసీఐ ఆధ్వర్యంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్లతో పాటు 15 జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం సీసీఐ జిన్నింగ్ మిల్లులను అద్దెకు తీసుకునే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నెల 25లోగా టెండర్ల ప్రక్రియ పూర్తవనుండగా తదుపరి గైడ్‌లైన్స్ విడుదల చేయనుంది.

సిబ్బందితోనే అసలు సమస్య

భారత పత్తి సంస్థ(సీసీఐ) రైతులకు కాకుండా వ్యాపారులకే మద్దతుగా నిలుస్తుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏటా సిబ్బంది కొరత పేరుతో జిన్నింగ్ మిల్లులకే సహకరిస్తుంది. సగటు మూడు కేంద్రాలకు ఒక అధికారిని నియమించడంతో ఏ కేంద్రంలో ఎప్పుడుంటారో తెలియని అయోమయ పరిస్థితి. ప్రతీ కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలి. తాత్కాలిక నియామకాలు కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి. కొనుగోలు చేశాకా 48గంటల్లో అన్నదాత ఖాతాలో డబ్బులు జమయ్యేలా చూడటంతో పాటు హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోనూ సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేయాలి, అలాగే గతంలో కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో తూకంలో తేడా వచ్చి అన్నదాతలు మోసపోయిన సందర్భాలున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల్లో రైతులు పత్తిని విక్రయించాక వెంటనే డబ్బులు ఇవ్వడానికి వ్యాపారులు కొంత మొత్తం మినహాయించుకుంటున్నారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం. దీనికి అడ్డుకట్ట వేయాలి.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న డాక్టర్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులు బాల్యం నుంచే ఓ లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీవీ సీరియల్ నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కె.వీ.ప్రదీప్‌కుమార్ అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ ప్రాంగణంలో ఆదివారం అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతదేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర' అనే సదస్సుకు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు భారత్ అని, భారతదేశ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యావేత్త డా.బి.మధుసూదన్ రెడ్డి, ఈసీజీ ఫౌండర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవ 2024 పోస్టర్ ఆవిష్కరణ

హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ-2024 వాల్ పోస్టర్, కరపత్రాలను ఆదివారం కొత్తపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. సంస్థ సభ్యులు కుంటాల శ్రీనివాస్, జిల్లా రమణ, చాడ మధుసూదన్ రెడ్డి, పి.శ్రీనివాస్ శర్మ, ఈ.నగేష్, మనోజ్ పాల్గొన్నారు.

జోష్ నింపిన స్పార్కిల్- 2024

జగిత్యాల: విద్యార్థులు అధ్యాపకులు బోధించే విషయాలను ఏకాగ్రతతో విని, వాటిని విశ్లేషించుకోవాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల స్థానిక అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఫెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంబులెన్సుకు ప్రమాదం


ప్రమాదానికి గురైన అంబులెన్సు వద్ద జనం

పెద్దపల్లిరూరల్: ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లే అంబులెన్స్ ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బోల్తాపడింది. పట్టణంలోని శాంతినగర్ నుంచి వస్తున్న అంబులెన్సును బొలెరో వాహనం ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ ధోని చేతికి గాయమైంది. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో ఏర్పాటు చేసిన చిమ్నీ వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో రెస్టారెంట్ మొత్తం పొగతో నిండిపోయింది. సిబ్బంది అప్రమత్తమై ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు డివిజన్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా బరిలో ఉంటా


మాట్లాడుతున్న కడారి అనంతరెడ్డి

- మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

కరీంనగర్: టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించి ఆశీర్వదిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తానని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఓ హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా), జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్, ఇతర సంఘాల నేతలతో కలిసి మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న శాసనమండలి ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీగా తాను బరిలో ఉంటానని, బీజేపీ మద్దతు కోసం రాష్ట్ర నాయకులను కలిసి విన్నవించానని, అవకాశం ఇస్తే బీజేపీ మద్దతుతో లేనట్లయితే విద్యాసంస్థల అండదండలతో స్వతంత్రంగా పోటీ చేయడం ఖాయమని వెల్లడించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైతే నాణ్య మైన, విలువలతో కూడిన విద్య కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమార్, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, ఏ.రామచంద్రారెడ్డి, బి. మధుసూదన్‌రెడ్డి, ప్రకాశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

జాయింట్ వెంచర్‌లో రామగుండం పవర్‌ప్లాంట్

- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి-టీజీ జెన్‌కో జాయింట్ వెంచర్‌లో రామగుండంలో 800మెగావాట్ల పవర్ ప్లాంట్ నెలకొల్పేందుకు ఉత్తర్వులు జారీ అయినట్లు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదివారం తెలిపారు. రామగుండం 62.5 బి థర్మల్‌పవర్ స్టేషన్ స్థానంలో జాయింట్ వెంచర్ ద్వారా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ నెలకొల్పాలని, దీనికి సంబంధించి డిటేల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందించాలని సూచించారు. రామగుండం ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతి మేరకు ప్రభుత్వ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే వారంలోగా జాయింట్ వెంచర్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించాలని, వచ్చే నెలలోగా ప్రిఫేర్ ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాలని జెన్‌కోకు సూచించారు. సింగరేణి సంస్థ, టీజీ జెన్‌కోతో కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు.

సమస్యలపై ప్రశ్నించడమే లక్ష్యం

- పి. సుగుణాకర్‌రావు


మాట్లాడుతున్న పి.సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: ప్రజల సమస్యలపై ప్రశ్నించడమే లక్ష్యంగా గత మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నానని బీజేపీ సీనియర్ నాయకులు పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. ఆదివారం చైతన్యపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరపున తాను బరిలో ఉంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నానని వెల్లడించారు. బీజేపీ సీనియర్ నాయకులు దుర్గ మారుతి, గంప జగన్, ఎలగందల్ నందకుమార్, తాదూరి బ్రహ్మం, జెడి భగవాన్, కనక చంద్రం, మొలుగూరి కిషోర్, కొత్త శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత


రమేశ్‌కు నగదు కవర్ అందిస్తున్న డిపో మేనేజర్

మంథని: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న డబ్బును ప్రయాణికుడి అందించిన ఆర్టీసీ ఉద్యోగులను పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాలు.. గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కాటారం సమీపంలో రమేశ్ అనే వ్యక్తి ఎక్కాడు. భూపాలపల్లిలో దిగి హనుమకొండ వెళ్లేందుకు మరో బస్సులో ఎక్కాడు. అయితే తన వెంట తీసుకొచ్చిన రూ.2లక్షల బ్యాగు కనిపించకపోడవంతో హైరానా చెంది భూపాలపల్లి సెక్యూరిటీ సిబ్బందికి విషయం తెలియజేశాడు. బస్సు తిరిగి గోదావరిఖనికి బయలుదేరింది. ఈ క్రమంలో సదరు బస్సు వివరాలు తెలుసుకోగా తిరుపతమ్మ కండక్టర్, డ్రైవర్ మొగిలిగా గుర్తించి బస్సు మంథని మీదుగా వెళ్తోందని ఇక్కడి డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. డీఎం శ్రావణ్‌కుమార్ బస్సు సీటులో ఉన్న డబ్బుల కవర్‌ను స్వాధీనం చేసుకొని రమేశ్‌కు అందించారు. బస్సు కండక్టర్, డ్రైవర్, భూపాలపల్లి సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

'జల్సా' జోష్

కొత్తపల్లి: కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత విద్యాసంస్థల ఉపాధ్యాయులకు జల్సా పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జోష్‌ను నింపాయి. ఆట, పాటలు, నాటికలు, ఉపన్యాసాలు, నృత్యాలతో సుమారు 650 ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఈ జల్సా కార్యక్రమాన్ని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చైర్మన్ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేశ్, ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, హెచ్‌ఎంలు బాలాజీ, ప్రశాంత్, శ్రీకర్, కవితాప్రసాద్, శర్మిష్ఠ, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న ఉపాధ్యాయినులు

మనీల్యాండరింగ్‌లో ఇరుక్కున్నావ్..

- ముంబయి పోలీసుల పేరుతో బెదిరింపులు
- రూ.1.43కోట్ల భారీ సైబర్ మోసం
- ట్రాన్స్‌ఫర్ చేసిన డబ్బులు మాయం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): 'మనీల్యాండరింగ్ కేసులో ఇరుక్కున్నావ్.. ఈ కేసు నుంచి బయటపడాలంటే నేను చెప్పిన అకౌంట్‌కు డబ్బు పంపించాలి' అంటూ సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. ముంబయి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ బెదిరింపులకు దిగడంతో బాధితుడు రూ.1.43 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు. సైబర్‌క్రైం ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ స్కూల్ నిర్వాహకుడు సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీగా మోసపోయాడు. ఈ ఏడాది జూలై 22న సైబర్ నేరగాళ్లు స్కూల్ నిర్వాహకుడికి ఫోన్ చేసి ×మనీలాండరింగ్‌లో ఇరుక్కున్నావు, కేసు నుంచి బయట పడాలంటే నేను చెప్పిన అకౌంట్‌కు డబ్బు పంపించాలి. తాము మీ డబ్బును చెక్ చేసిన తర్వాత మీ అకౌంట్‌కి తిరిగి పంపిస్తాం≅ అని నమ్మబలికారు. ముంబయి పోలీసులం మాట్లాడుతున్నామని, చెప్పినట్లు చేయకుంటే త్వరగా జైలుకి వెళ్తావని బెదిరించడంతో నమ్మిన బాధితుడు భయంతో విడతలవారీగా రూ.1,43,75,000 ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత మోసపోయినట్లు తెలుసుకుని ఈనెల 3న సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు మహారాష్ట్రలోని వాసిం జిల్లా దేవుపేట్‌వాసి సంతోష్‌శ్రీకృష్ణ నాగల్కర్‌ను పట్టుకొని విచారించారు. ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని బ్యాంక్ అకౌంట్ లావాదేవీలు పరిశీలించగా, కమీషన్ కింద అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లకు అమ్ముకున్నాడని, అతడి బ్యాంక్ అకౌంట్‌లను సైబర్ నేరాలకు ఉపయోగించేవారని, ఇదివరకు సదరు అకౌంట్‌ను 18 నేరాల్లో ఉపయోగించినట్లు ఏసీపీ వెల్లడించారు.

లింకులు ఓపెన్ చేయొద్దు

రుణమాఫీ పేరుతో ఏపీకే ఫైల్ ద్వారా సోషల్ మీడియాలో లింక్‌లు వస్తున్నాయి. వీటిని ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు పోలీస్‌వాళ్లం మాట్లాడుతున్నామని ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసి పెద్ద మొత్తంలో డబ్బు కాజేస్తున్నారు. సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో దాదాపు 41శాతం నేరాలు ఇవే జరుగుతున్నాయి. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి లేదా సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.

– వెంకటరమణ, సైబర్‌క్రైం ఏసీపీ

నాటుబాంబుల తయారీ ముఠా అరెస్ట్


కోనరావుపేటలో నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

- నలుగురి రిమాండ్
- 67 నాటుబాంబులు స్వాధీనం

కోనరావుపేట(వేములవాడ): నాటుబాంబులు తయారు చేస్తూ వాటి ద్వారా వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం ధర్మారంలో నాటుబాంబు పేలి గేదె మృతిచెందగా, యజమాని ముడికె మల్లేశం ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. గతంలో నాటుబాంబులు తయారు చేసిన పిట్టల రాజలింగంపై నిఘా పెట్టారు. ఆదివారం రాజలింగం నాటుబాంబులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో ఏఎస్సై రఘుపతిరెడ్డి తన సిబ్బందితో దాడి చేశాడు. బోనాలకు చెందిన పడిగె లస్మయ్యకు బాంబులు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద 27 నాటుబాంబులు, గన్‌పౌడర్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజలింగంను విచారించగా వీరిద్దరితోపాటు సర్దాపూర్‌కు చెందిన అంజయ్యకు విక్రయించినట్లు తెలిపాడు. వీరితోపాటు సర్దాపూర్‌లోని మొగిలి అంజయ్య ఇంటిపై దాడి చేయగా 20 నాటుబాంబులు లభించాయి. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ వేటగాళ్లను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సైలు అశోక్, కిరణ్, ఏఎస్సై రఘుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు విశాల్‌రాజు, రవి, సతీశ్, అభిషేక్, ఓదెలును సీఐ అభినందించారు.

దొంగిలించిన ఆభరణాలు విక్రయిస్తుండగా చిక్కిన దొంగ?


చోరీ జరిగిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం

రామగుండం: రామగుండం విద్యుత్‌నగర్‌కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పట్టపగలు తాళం పగులగొట్టి ఉత్సవ మూర్తుల ఆభరణాలను దొంగిలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 48 గంటలు తిరగకముందే ఓ వ్యక్తి ఆభరణాలను ఆదివారం గోదావరిఖనిలోని ఓ స్వర్ణకారుడికి విక్రయించే క్రమంలో సినీఫక్కీలో చిక్కిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడగా కొన్ని ఆభరణాలను ఒక వ్యక్తి మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్లాడు. మరో వ్యక్తి కొన్ని ఆభరణాలను గోదావరిఖనిలోని ఓ స్వర్ణకారుడి వద్ద విక్రయించేందుకు రాగా.. అక్కడే ఉన్న మరో స్వర్ణకారుడు వాటిని చూశాడు. కాగా, గతంలో ఇలాంటి ఆభరణాలు రామగుండంలోని తమ సోదరుడు చేసిన విషయం గుర్తొచ్చి వెంటనే తమ సోదరుడికి ఫోన్ చేయగా, ఆలయంలో ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన స్వర్ణకారుడు ఆలయ పూజారి, కమిటీ ప్రతినిధులకు సమాచారం అందించి వారు వచ్చేవరకు ఆభరణాలు విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని మాటల్లోకి దింపారు. ఆలయ పూజారి ఏటూరి శ్రావణ్‌కుమార్, కమిటీ ప్రతినిధులు స్వర్ణకారుడి వద్దకు చేరుకొని పరిశీలించగా చోరీకి గురైన ఆభరణాలుగా గుర్తించి సదరు వ్యక్తిని ప్రశ్నించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. మరో వ్యక్తి ఆభరణాలను మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్లగా అతడి వద్దే విలువైన ఆభరణాలున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ మేరకు సదరు వ్యక్తిని రామగుండం పోలీసులకు అప్పగించారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

- అరకిలో గంజాయి పట్టివేత
- మూడు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం

పెగడపల్లి: గంజాయి సేవిస్తూ ముగ్గురు వ్యక్తులు ఆదివారం పెగడపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 500గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని నామాపూర్ శివారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో దాడిచేయగా.. ధర్మపురి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోడేటి వెంకటేశ్, బుగ్గారం మండలం సిరికొండకు చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన గుండేటి ప్రవీణ్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరి వద్దనున్న బ్యాగులో 500 గ్రాముల గంజాయి లభించింది. గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రేమించాడు.. పెళ్లి అన్నాడు.. ఆపై తిరస్కరించాడు..?

- యువతి ప్రేమ ఖరీదు రూ.9లక్షలుగా వెల కట్టిన పెద్ద మనుషులు

జ్యోతినగర్(రామగుండం): యువతీ, యువకుడు మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటామని బాసలు చేసుకున్నారు. అంతలోనే మనస్పర్థలు రావడంతో వారి ప్రేమకు పెద్ద మనుషులు వెలకట్టిన ఉదంతం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ యువతి, యువకుడు కులాలు వేరైనప్పటికీ మనసులు కలిసి ప్రేమించుకున్నారు. మూడేళ్లుగా తమ ప్రేమను పంచుకుని పెళ్లి చేసుకుందామని ఓ నిర్ణయానికి వచ్చారు. ఇంతలోనే వారి మధ్యలో కొంత మనస్పర్థలు రావడంతో యువతిని పెళ్లి చేసుకునేందుకు యువకుడు నిరాకరించాడు. దీంతో బాధితురాలు యువకుడి ఇంటి ఎదుట నిరసన సైతం చేపట్టింది. ఇరువురి విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ వారిద్దరి పెళ్లి జరుగకపోగా వారి ప్రేమను విడగొట్టడానికి కొంత మంది పెద్దలు రూ.9 లక్షలుగా నిర్ధారించినట్లు తెలిసింది. ప్రేమకు వెలకట్టిన క్రమంలో రూ.4లక్షలు సైతం యువతి బంధువులకు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పెళ్లి చేసుకోవాలని యువకుడిని యువతి వేడుకున్నా.. యువకుడిది ఉన్నత కుటుంబం కావడంతో ఎట్టకేలకు యువతి ప్రేమకు వెలకట్టారు.